ర్దాగా.

కొర్దిసేపు వాడేమీ మాట్లాడలేదు.

మెల్లగా తల పైకెత్తాడు. వాడి ముఖం దీనాతిదీనంగా ఉంది.

''నా దురదృష్టంరా అంతా! ఎలాగోలా ఇక్కణ్నుంచి తప్పించుకొని వెళ్లిపోయాను కదా! ఈ ఆర్నెల్లు హాయిగా గడిచిందో లేదో అక్కడ మా ఆఫీసర్‌కి ట్రాన్స్‌ఫరై వెళ్లిపోయాడు'' కొర్దిగా ఆగి టీపాయ్ మీద నున్న మంచినీళ్ల గ్లాసందుకొని గడగడా తాగేశాడు.

''అయితే...''

''మరింకేం లేదు. మా పాత బాస్ కర్కోటకుడు ఇక్కడ్నుంచి ట్రాన్స్‌ఫరై అక్కడ మా బ్రాంచ్‌కి దాపురించాడు. నిన్ననే వచ్చి జాయినయి నన్ను చూసి విషపు నవ్వు నవ్వాడు. ఇంక నన్ను రక్షించే వాడే లేడు. వాడి బారి నుండి తప్పించుకోవడానికి, నేను ట్రాన్స్‌ఫరై వెళ్తే, నా వెనుకే రాహువులా మళ్లీ దాపురించాడు'' అన్నాడు దీనంగా.

వాడి మాటలు విని అవాక్కయ్యాను నేను. ఇలాంటి పరిస్థితి కలుగుతుందని అనుకోలేదు మరి.

-డి.వి.డి. ప్రసాద్
(పదంపూర్, ఒరిస్సా)

# పాపం కళ్యాణి

"మా అమ్మాయి సత్యవతి" అంటూ రామ్మూర్తి కూతుర్ని పెళ్లికొడుకు మనోహర్‌కు, అతని తల్లిదండ్రులకు పరిచయం చేశాడు. అందరికీ నమస్కారాలు పెట్టిన తరువాత సత్యవతి సోఫాలో కూర్చుంది.

"నువ్వు బాగా పాడతావని మీవాళ్లు చెప్పారు. ఒక పాట పాడమ్మా" అని అడిగింది పెళ్లికొడుకు తల్లి విశాలాక్షి. త్యాగరాజ కృతి పాడింది సత్యవతి. ఆమె గానమాధుర్యానికి అందరూ తన్మయులయ్యారు. విశాలాక్షి మళ్లీ అడిగిన మీదట అన్నమాచార్య కీర్తన, జయదేవుని అష్టపది కూడా పాడి వినిపించింది.

ఇల్లు చూసే నెపంతో పెద్దవాళ్లంతా లోపలకు వెళ్లారు. మనోహర్, సత్యవతి తాము చేస్తున్న ఉద్యోగాల గురించి, హాబీల గురించి మాట్లాడుకున్నారు.

అంతలోనే కళ్యాణి గేటు తీసుకొని సరాసరి హాల్లోకి వచ్చింది.

"నా ఫ్రెండు కళ్యాణి" అని మనోహర్‌కు పరిచయం చేసింది సత్యవతి.

"ఇతను మనోహర్. స్టేట్ బ్యాంకు కోఠి బ్రాంచిలో పనిచేస్తున్నారు" కళ్యాణితో చెప్పింది.

"మీరు జాబ్ చేస్తున్నారా?" అని అడిగాడు మనోహర్.

"లేదు. డిగ్రీ పూర్తి చేసింది. మిస్టర్ రైట్ కోసం చూస్తుంది" అంది సత్యవతి నవ్వుతూ.

"అలాగా! ఆల్ ది బెస్ట్" అన్నాడు మనోహర్ చిరునవ్వుతో.

"థాంక్యూ!" అంది కళ్యాణి మెరిసే కళ్లతో అతని వంక చూస్తూ.

పేరుకు తగ్గట్టు ఎంత అందంగా ఉన్నాడో! సత్యవతి అతనికి నచ్చుతుందా? అనుకుంది కళ్యాణి అనుమానంగా. పెద్దవాళ్లంతా హాల్లోకి వచ్చారు.

సత్యవతి కంటె చొరవగా మనోహర్‌తో నవ్వుతూ మాట్లాడుతున్న కళ్యాణిని చూసి ముచ్చటపడింది విశాలాక్షి.

"అమ్మాయి బంగారు బొమ్మలాగ ఉంది. మీ అమ్మాయి ఫ్రెండా?" అని అడిగింది సత్యవతి తల్లి వరలక్ష్మిని.

"అవును" అంటూ ముక్తసరిగా జవాబిచ్చింది వరలక్ష్మి. ఫోను చేసి అభిప్రాయం చెప్తామంటూ పెళ్లివారు వెళ్లిపోయారు.

* * *

"కళ్యాణి మన పొరుగున ఉన్నంత కాలం మనమ్మాయికి కళ్యాణం కలసి వచ్చేటట్లు లేదు. మనం చెప్పకపోయినా పెళ్లిచూపుల టైముకు ఠంచనుగా తయారైపోతుంది. వచ్చిన వాళ్లు మనమ్మాయిని చూడటం మానేసి ఆ పిల్లవంక గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోవటం. వెళ్లాక మీ అమ్మాయి నచ్చలేదు కానీ మీ అమ్మాయి ఫ్రెండు నచ్చింది. వాళ్ల ఫోను నెంబరివ్వండి అని అడగటం పరిపాటి అయిపోయింది. నచ్చలేదని ఆ పెళ్లికొడుకుల్ని తిరస్కరించింది కానీ ఈ అబ్బాయిని కాదనదు. మరెక ఇంటికి మారిపోతే తప్ప పిల్లకు పెళ్లి కుదరదేమో! తనకు సంబంధం కుదరటం లేదన్న ఆందోళనతో ఆవేదనతో తల్లితండ్రితో అంటున్న మాటలు విని నిట్టూర్చింది సత్యవతి. చిన్నప్పటి నుంచి బాగా తెలిసి ఉండడం వలన కళ్యాణి తమ ఇంటికి చనువుగా వేళాపాళా చూడకుండా వస్తూపోతూ ఉంటుంది. కళ్యాణి అందం, చలాకీతనం, చొరవ ఎవరినైనా ఇట్టే ఆకర్షిస్తాయి. పెళ్లిచూపులకు వచ్చిన వాళ్లు కళ్యాణిని చూడగానే తనతో మాట్లాడటం మానేసి తనను పట్టించుకోకుండానే వెళ్లిపోయిన సందర్భాలు లేకపోలేదు. పెళ్లిచూపుల టైములో కళ్యాణి లేకుండా ఉంటే బాగుండనుకున్నా. ఇంతవరకు ఆమె రాక పోవడమంటూ జరగలేదు.



"నా పెళ్లి గురించి మీరు బెంగ పెట్టుకోవద్దమ్మా! నాకు మ్యూజిక్ స్కూలులో మంచి ఉద్యోగం ఉంది. అదే నాకు రక్షణ, తోడు. వస్తాను" అంటూ స్కూలుకు వెళ్లిపోయింది సత్యవతి.

* * *

"కళ్యాణిగారూ-

మీరు నా పేర బాంకుకు రాసిన ఉత్తరం అందింది. సత్యవతి ఏవరేజ్ స్టూడెంటని, అందగత్తె కాకపోవటం వల్ల ఎవరూ ఆమెను పట్టించుకునే వారు కాదని, అబ్బాయిలను ఆకర్షించటానికి ప్రయత్నించి నవ్వుల పాలవుతూ ఉండేదని, ఆమెలో ఉన్నవన్నీ మైనస్ పాయింట్లేనని రాశారు. ఎన్నో సంగీత పోటీల్లో ఆమె బహుమతులు గెల్చుకున్నదని, ఆమెకున్న గొప్ప ప్లస్ పాయింట్ ఆమె సంగీతమని మీకు తెలియదా? మీ గురించి నేనామెను అడిగినప్పుడు మీరు చక్కదనం, చలాకీతనం ఉన్న మంచి అమ్మాయని చెప్పింది. ఎదుటివారిలోని మంచిని మాత్రమే చూసే ఆమె సంస్కారం ఆమెకొక ప్లస్‌పాయింటు కాదా?

ఆశలుండటం తప్పుకాదు. వాటిని నెరవేర్చుకోవటానికి ఇంకొకరి వ్యక్తిత్వాన్ని కించపరిచి, వాళ్ల ఆశలను త్రుంచే ప్రయత్నం చెయ్యటం మాత్రం తగదు. మీ వాళ్లు మా వాళ్లను కాంటాక్టు చేస్తారని రాశారు. కాని ఆ అవసరం లేదు". -మనోహర్.

తిరస్కరించటమే కానీ తిరస్కరింపబడటం ఎరుగని కళ్యాణి ఆశాభంగంతో, కోపంతో ఉత్తరాన్ని చింపి ఉండగా చేసి డస్ట్‌బిన్‌లో పడేసింది.

* * *

"మన పెళ్లికి కళ్యాణి రాకపోవటం చాలా వెల్తిగా అనిపించిందండీ! పెళ్లి రెండు రోజులుందనగా అర్జెంటుగా రమ్మన్నారంటూ వాళ్ల మామయ్యగారి ఊరికి వెళ్లిపోయింది" అంది సత్యవతి మనోహర్‌తో.

"మొహం చూపెట్టలేకపోవటానికి తనేం తప్పు చేసిందండీ?" అని అడిగింది సత్యవతి నివ్వెరపోతూ. "ఏం చేసిందంటే..." అంటూ జరిగినదంతా వివరించాడు మనోహర్.

స్నేహితురాలినని కూడా ఆలోచించకుండా స్వార్థంతో తన గురించి చులకనగా రాసి మనోహర్‌ను పొందాలనుకున్నది కళ్యాణి. కాని ఆ ప్రయత్నంలో తనని తనే చులకన చేసుకుంటున్నట్లు గ్రహించలేకపోయింది పాపం కళ్యాణి అనుకుంది సత్యవతి.

-జి.సరస్వతి (బెంగుళూరు)